AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

పట్టాలిప్పించండి మహాప్రభో..



2



2

ఘనంగా సీత్లా పండుగ

## గిన్నిస్ రికార్డు సాధించిన కరాటే క్రీడాకారులను అభినందించిన పీసీసీ చీఫ్..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** గిన్నిస్ రికార్డు సాధించిన కరాటే క్రీడాకారులను పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అభినందించారు. ఈ మేరకు కరాటే క్రీడాకారులు మంగళవారం జిల్లాకు వచ్చేసిన పీసీసీ చీఫ్ ను కలువగా ఆయన వారిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ అరాచక పాలనను ప్రజలు మరిచిపోలేదు : టీపీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వారిది అరాచక పాలన అయితే కాంగ్రెస్‌ది ప్రజాపాలన అని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎందరో నిరుద్యోగుల ఉసురు పోసుకున్న కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదని పీసీసీ చీఫ్ అన్నారు. ఉద్యోగాల పేరుతో కేటీఆర్ దొంగ ఏడుపు ఏడుస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అంతా తానే నడిపిన కేసీఆర్ కాళేశ్వరాన్ని నిర్మించి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అసత్యాలు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మేస్థితిలో లేరని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మెజార్టీ హామీలను పూర్తి చేశామని స్పష్టం చేశారు. మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్నాయని బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రం తరపున అందాల్సిన నిధులు త్వరలోనే అందుతాయని.. తద్వారా ఆర్వోబీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కవితా రెడ్డి, కౌడపు శరత్ పాల్గొన్నారు.

## ఆహార నాణ్యతపై రాజీ పడవద్దు



**అక్షరటుడే, కామారెడ్డి:** హాస్టళ్లలో ఆహార నాణ్యతపై రాజీ పడవద్దని కామారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో నీటి సమస్య ఉందని తెలుసుకున్న ఆమె మంగళవారం తనిఖీ చేశారు. హాస్టల్‌కు చేరుకున్న ఛైర్‌పర్సన్‌కు హాస్టల్ వార్డెన్ స్వప్న, విద్యార్థినులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె హాస్టల్ పరిసరాలు, వసతి గదులు, వంటగది, మరుగుదొడ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నీటి సరఫరాలో తలెత్తిన సమస్యపై మిషన్ భగీరథ అధికారులతో వెంటనే మాట్లాడారు. వచ్చే వారం రోజుల్లోపు నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సూరోజు వనిత, డీఈ హన్మంత్ రావు, హాస్టల్ వార్డెన్ స్వప్న, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అడుగంటిన ప్రాజెక్టులు..

■ వర్షాలు లేక గణనీయంగా పడిపోయిన నిల్వలు ■ ఆందోళనలో రైతన్నలు

**వానాకాలం సీజన్ వచ్చి నెల దాటినా వర్షాలు సరిగా కురవకపోవడంతో ఉమ్మడి జిల్లాల్లో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో సాగు పనులు ప్రశ్నార్థకంగా మారాయి. రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురుచూడాల్సి వస్తోంది.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

■ ఎల్‌నినో ప్రభావంతో జాడలేని వర్షాలు

■ నాట్లు వేసి నీళ్ల కోసం రైతన్నల ఎదురుచూపులు

■ ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచిస్తున్న అధికారులు

■ ఉమ్మడి జిల్లాలో అయోమయంలో రైతాంగం

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టుల నీటిమట్టాలు అడుగంటి డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. దీంతో వానాకాలం పంటల సాగు, తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉండడంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉండడంతో వర్షాలు ముఖం చాటేశాయి. వర్షాకాలం ప్రారంభమై యాభై రోజులకు పైగా గడుస్తున్నా వరుణుడి కరుణ రైతులపై లేకుండా పోయింది. ఎగువ నుంచి సైతం ఆశించిన స్థాయిలో వర్షాలు లేక ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ వెలవెలబోతున్నాయి.

### ఎండిపోతున్న నార్లు.. అన్నదాతల్లో ఆవేదన..

ఉమ్మడి జిల్లాలో గత రెండు మూడురోజుల నుంచి అడపాదడపా వాన చినుకులు కురవడం తప్ప ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మోస్తరు వర్షం కూడా కురవలేదు. ఇప్పటికే పొలల్లో వేసిన నార్లు నీళ్లు లేక ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. బోర్లకింద సాగవుతున్న పంటలు కాకుండా వర్షాలమీదే ఆధారపడ్డ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆకాశంవైపు చూస్తూ.. వరుణ దేవుడు ఎప్పుడు కరుణిస్తాడా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

### నిజాంసాగర్‌లో 6 టీఎంసీలకే పరిమితం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రధాన ఆధారమైన నిజాంసాగర్ ప్రాజెక్టుకు 17.802 టీఎంసీల సామర్థ్యం ఉండగా ప్రస్తుతం కేవలం 6 టీఎంసీల నీరే ఉంది. జూలై నెల వచ్చినా ఆశించిన స్థాయిలో వర్షాలు రాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 278.5 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే చాలా తక్కువ. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ, పిట్లం ప్రాంతాల్లో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం 17,802 ఎకరాలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. గోదావరి జలాలు వస్తాయా లేదా అనే అనుమానంతో రైతులు ఉన్నారు. సింగూర్, కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌కు వెంటనే నీటిని తరలించాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### పోచారం ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి..

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్టు పరిస్థితి కూడా దయనీయంగా ఉంది. ఒకప్పుడు పూర్తి స్థాయిలో ఉన్న ప్రాజెక్టు ఇప్పుడు డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నీటి నిల్వలు అడుగంటాయి. నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల్లోని 16 వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతుంది. పోచారం నుంచి అన్నాసాగర్ వరకు కాల్వల ద్వారా పంటలకు నీరందించేవారు. కానీ ఇప్పుడు నీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

### బోరుబావులపైనే ఆధారం..

ప్రాజెక్టుల నుంచి నీరు రాకపోవడంతో రైతులు బోరు బావులపై ఆధారపడాల్సి వస్తుంది. వరుణుడు కరుణిస్తాడనే ఆశతో కొందరు రైతులు అప్పులు చేసి నారుమడులు, విత్తనాలు కొనుగోలు చేశారు. వర్షాలు లేకపోతే చేసిన పెట్టుబడి మొత్తం బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఆరుతడి పంటలు సూచించినా, ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకున్న రైతులు ఏం చేయాలో అర్థం కాక తికమక పడుతున్నారు.

## బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఆయనను బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఇప్పటివరకు బాన్సువాడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన విజయ్ భాస్కర్‌ను ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఎం శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాన్సువాడ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది స్వాగతం పలికారు.



## శ్రీనగర్‌లో లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజలకు సౌకర్యంగా ఉండేలా నూతన వంతెన నిర్మాణానికి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. నగరంలోని వినాయకనగర్ నుంచి ఎల్లమ్మ గుట్టకు వెళ్లే దారిలో బాల హనుమాన్ ఆలయం పక్కన గల లో లెవెల్ వంతెనని మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం వంతెన వద్ద నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. వంతెన నిర్మాణానికి అంచనాలను సిద్ధం చేసి ప్రపోజల్ పెట్టాలని సూచించారు. త్వరగా సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ఏబీవీపీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కామన్ సర్వీస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కామన్ సర్వీస్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.ముక్తిద సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కామన్ సర్వీస్ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ద్వారా, పత్రికా కథనాల ద్వారా తెలుసుకున్నామన్నారు. కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు, సాధారణ ప్రజలకు వెంటనే సేవలు అందేలా జిల్లా కోర్టు ప్రాంగణంలోనే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, అడ్వకేట్ క్లర్కులు, కక్షిదారులు, సాధారణ ప్రజలు ఎస్ఐఆర్ దరఖాస్తులను సులభంగా నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, మొబైల్ కోర్ట్ జడ్జి దీక్ష, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి టి.నాగరాణి, సీనియర్ సివిల్ జడ్జి



డా. సూర సుమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నారాయణ, ప్రభుత్వ న్యాయవాది శ్యామ్ గోపాల్ రావు, తహశీల్దార్ హిమబిందు, కోర్టు సీఏవో రాంచందర్, సూపరింటెండెంట్ భుజంగరావు, వెంకట్ రెడ్డి, చంద్రసేన్ రెడ్డి, పారా లీగల్ వలంటీర్ విజయ్ కుమార్ తో పాటు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఓబీసీ మహాసభలకు పీసీసీ చీఫ్‌కు ఆహ్వానం



**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ ఓబీసీ మహాసభలను బెంగళూరులో వచ్చేనెల 7న నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు మంగళవారం ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ.. మండల్ సిఫార్సులు అమలుపర్చిన ఆగస్టు 7న ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఓబీసీ 11వ జాతీయ మహాసభలు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 80 కోట్ల మంది ఓబీసీల డిమాండ్ల పరిష్కారమే ధ్యేయంగా, రాజకీయ అధికారమే లక్ష్యంగా ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



## భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఈత మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం కోసం ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించడం ద్వారానే పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమయ్యల లక్ష్మీరాజు, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ చంద్ర, సీఐ సంపత్ కృష్ణ, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాసరావు, ఏపీవో అన్నపూర్ణ, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, ఫరీద్, కానిస్టేబుళ్లు ఘోరీ, రాజు, దినేష్, శరత్, పవన్, బాబు పాల్గొన్నారు.

## పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీసులు విధినిర్వహణతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సీపీ సాయి చైతన్య సూచించారు. నగరంలోని బ్రిడ్జిగ్యాప్ హాస్పిటల్, ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్, మేఘన డెంటల్ హాస్పిటల్, లెజిట్ డయాగ్నొస్టిక్స్ వారి సౌజన్యంతో పోలీస్ శాఖ సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అనేది ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అనేక రకాల శారీరక, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారన్నారు. అసమయ భోజనం, నిద్రలేమి, నిరంతర విధులు, ఒత్తిడితో కూడిన జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా విధి నిర్వహణలో భాగంగానే భావించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్ యాదవ్, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సరళ, ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ అమర్ దీపిక, అనాలజిస్ట్ అరవింద్, కార్తీక్, ఆర్ఎంవో రవీంద్రనాథ్ సూరి, మేఘన డెంటల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఆదిత్య తేజ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) ధరణి కుమార్, (వెల్ఫేర్) సతీష్, రూరల్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.






# పట్టాలిప్పించండి మహాప్రభో..

■ 983 సర్వే నంబర్‌లో పట్టాల కోసం రైతుల ఎదురుచూపు ■ ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌కు మొరపెట్టుకుంటున్న రైతులు ■ ప్రజావాణిలో సైతం ఫిర్యాదు

**లింగంపేట మండల కేంద్రంలో తాతల కాలం నుంచి భూములను సాగు చేసుకుంటున్న తమకు పట్టాలివ్వాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు. ధరణిలో భాగంగా భూముల సర్వే చేసిన సమయంలో ఇది ఫారెస్ట్ ల్యాండ్ అని తేలడంతో అప్పటి నుంచి రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. అలాగే పట్టాలు రాక ప్రభుత్వ కార్యాలయాలు..కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఏంచేయాలో తోచక అయోమయంలో ఉన్నారు. – అక్షరటుడే, లింగంపేట**

మండల కేంద్రంలో సర్వే నెంబర్ 983లో సుమారు 180 మంది రైతులు తాతల కాలం నుంచి పంటలను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సుమారు 400 ఎకరాలకు పైగా భూమి ఈ సర్వే నంబర్‌పై ఉంది. గత ప్రభుత్వం తీసు



కువచ్చిన ధరణిలో 983 సర్వేనెంబర్‌ను ఆర్‌వోఎఫ్ పరిధిలో ఉందని పార్ట్ బీలో చేర్చారు. అప్పటినుండి ఇప్పటివరకు 983 సర్వేనెంబర్‌లోని రైతులు సుమారు 140 మంది రైతులు ప్రజా ప్రతినిధులను, కలెక్టర్, మంత్రులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగడం లేదని వారు వాపోయారు. సోమవారం మరో మారు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు.

### 983 సర్వే నెంబర్‌లోనే ప్రభుత్వ కార్యాలయాలు

లింగంపేట మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇందిరా క్రాంతి భవనం, రైతు వేదిక, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు 983 సర్వే నంబర్‌లోనే కొనసాగుతున్నాయి. గతంలో ప్రభుత్వ భూమిగా ఉండేదని ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఆర్ఓఆర్ఎఫ్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని గెజిట్ రావడంతో అప్పటినుండి రిజర్వ్ ఫారెస్ట్ లోనే కొనసాగుతున్నాయి.

### రైతు భరోసాకు, రైతు బీమాకు నోచుకోని రైతులు

983 సర్వే నెంబర్ సుమారు 180 మంది రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. అందులో సుమారు 40 మంది రైతులకు సంబంధించి అసైన్డ్ భూమిగా గుర్తించడగా ధరణిలో పొందుపర్చారు. మిగతా 140 మంది రైతుల పరిస్థితి అగమ్య గోచర్యంగా మారింది. రైతు భరోసా, రైతు బీమా పథకాల రైతులకు అందక తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కనీసం సాగు చేసిన పంటలను అమ్ముకోవాలన్నా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు గతంతో 983 సర్వేనెంబర్ రైతులకు మేలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, కలెక్టర్ తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## హాస్టల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యతలపై తనిఖీలు



**అక్షరటుడే,నందిపేట్:** నందిపేట మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుద్వాన్‌పూర్ గ్రామంలో ఎస్‌సీడీడీ మరియు బీసీడీడీ వసతి గృహాలను సందర్శించారు. వంటశాల ఆహార నిల్వ గదులను పరిశీలించారు. వంట సరుకుల తయారీ, గడువు తేదీలను తనిఖీ చేసి, ఆహార పదార్థాల నాణ్యత పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వసతిగృహాల్లో పరిశుభ్రమైన వాతావరణం, వంటశాల పరిశుభ్రత, సురక్షిత ఆహార నిర్వహణపై వార్డెన్లకు అవగాహన కల్పించి తగిన సూచనలు చేశారు. డెంగీ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ, జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.

## బుడ్మి హరిహర దేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆషాఢ మాసం సందర్భంగా బాన్సువాడ మండలం బుడ్మి గ్రామంలోని హరిహర దేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి హరిహర దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురు మదనానంద సరస్వతి పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతి స్వామి సమక్షంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## జన జాగరణ యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

**అక్షరటుడే, ఇందూరు:** టీఎస్‌సీపీఎస్ఈయూ జన జాగరణ యాత్ర పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోధన్, నిజామాబాద్‌లలో 22,23 వ తేదీల్లో జరిగే సీపీఎస్ వ్యతిరేక ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. ఓపీఎస్ ఆకాంక్షను ప్రభుత్వానికి చేరేవిధంగా యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తులసీరాం, ప్రసాద్, బీరేందర్ సింగ్ పాల్గొన్నారు.



## మొక్కలు నాటి.. సంరక్షించాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కాపాడుకునే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని బాబాపూర్ సర్పంచ్ ఎంఏ సమీర్ పిలుపునిచ్చారు. భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ పెద్దమ్మ గుడి ప్రాంగణంలో మంగళవారం ఉపాధి హామీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద కనీసం ఐదు మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంద గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సంతోష్, పాలకవర్గ సభ్యులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఇంకుడు గుంతలు నిర్మించాలి

**అక్షరటుడే, భీమ్‌గల్ :** ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకుని, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సీడీఎంఏ ఆదేశాల మేరకు భీమ్‌గల్ పట్టణంలోని 8వ వార్డులో మంగళవారం 'జలశక్తి అభియాన్ క్యాచ్ ది రైన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండాలంటే ఇళ్లలో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్



చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటి లతా నర్సయ్య, కౌన్సిలర్లు ఎం. సందీప్, ఆరేపల్లి శ్రీజ నాగేందర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల హక్కుల కోసం బస్సు యాత్ర జయప్రదం చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** కల్లుగీత వృత్తి రక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం ఆగస్టు 2 నుంచి 18 వరకు చేపట్టనున్న చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సైదగౌని వెంకట్ గౌడ్ కోరారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో చైతన్య యాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 50ఏళ్లు పూర్తి చేసుకున్న గౌడ కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా గీత కార్మికుల సమస్యలను ప్రజలకు తెలియజేయడమే ఈ యాత్ర ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, నారాగౌడ్, సాయాగౌడ్, రాజాగౌడ్, శంకర్ గౌడ్, సత్యాగౌడ్, రామాగౌడ్, రాజేందర్ గౌడ్, జీవన్ గౌడ్, రమేష్ గౌడ్, దేవాగౌడ్, అంజాగౌడ్, బస్వగౌడ్, మోహన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డిలో ఘనంగా గురు సమ్మేళనం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ఉన్నికృష్ణన్ నంబూద్రి గురువు ఆధ్వర్యంలో గురు సమ్మేళనం నిర్వహించారు. రాబోయే డిసెంబర్ 12న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన "అయ్యప్పల సంఘటిత ఐక్యత అద్వైత సంగమం" మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఒకేరోజు లక్షమంది అయ్యప్ప స్వాములతో మహా సంగమం ఏర్పాటు చేసి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడమే కాకుండా అయ్యప్ప స్వాముల ఐక్యతను చాటనున్నారు. మహా సంగమంలో 18,000 మంది స్వాములతో నామ సంకీర్తన, విశేష హోమము, 'సుందర లహరి' పారాయణం నిర్వహించనున్నారు.

## రహత్ నగర్ తండాలో ఘనంగా సీత్లా పండుగ

**అక్షరటుడే, భీమ్‌గల్:** రహత్ నగర్ గ్రామంలోని పాతతండాలో బంజారా సమాజ ఆరాధ్య దైవమైన సీత్లా భవానీ అమ్మవారి పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులు ఇచ్చి, నైవేద్యాలు సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు. పండుగ వేడుకల్లో మహిళలు బంజారా సాంప్రదాయ వేషధారణలో పాల్గొని, భక్తి గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తండావాసులందరూ ఐకమత్యంతో పాల్గొని వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో తండా నాయకుడు జవహర్‌లాల్ నాయక్, ఉపసర్పంచ్ సేవలాల్ నాయక్, కార్బరీ లాల్ సింగ్ నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ సంగ్యా నాయక్, సేవాలాల్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## తాళం వేసిన ఇంట్లో చోరీ..

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలు మోత్కూరి విమల తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న దుర్కి గ్రామంలో బంధువులు మృతి చెందడంతో విమల ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. కాగా.. సోమవారం ఉదయం పక్కింటి వారు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. దీంతో వెంటనే ఇంటికి చేరుకున్న విమల స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో నుంచి ఒక తులం బంగారం, 12 తులాల వెండి, రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితురాలు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో ఒక గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. స్థానిక పరిసర ప్రాంతంలో ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆ వ్యక్తి అప్పటికే మరణించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో వివరాలు సేకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి గుర్తింపునకు సంబంధించి ఏమైనా వివరాలు తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

## రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలి



**అక్షరటుడే, కోటగిరి:** రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని మండల విస్తీర్ణ అధికారి నిషిత సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే, ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పోతంగల్ మండలంలోని రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. మండలంలోని హెగ్డేలి రైతు శివారులో సోయా సాగు పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటల సాగు విస్తీర్ణాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తక్కువ నీటితో మంచి దిగుబడిని ఇచ్చే కందులు, మొక్కజొన్న, పత్తి, చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన అధిక దిగుబడి, తక్కువ కాల వ్యవధి ఉన్న విత్తన రకాలను మాత్రమే ఉపయోగించాలని కోరారు.

## నూతన ఎస్సైని ఘనంగా సన్మానించిన మాజీ ఎంపీపీ



**అక్షరటుడే, భిక్కనూరు:** మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌ను భిక్కనూరు మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సైకి శాలువా కప్పి సత్కరించి స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు అవసరమైన సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్‌శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాచాపూర్ మాజీ సర్పంచ్ యాదవయ్య తదితరులు పాల్గొన్నారు.